సాక్షి సూర్యాపేట

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



వ్యక్తి దారుణ హత్య
నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇప్పల గూడెం గ్రామంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు.
- 8లో



నైపుణ్య యూనివర్సిటీ
భూదాన్‌పోచంపల్లిలో నైపుణ్య యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- 10లో



ప్రకృతి వ్యవసాయంతో భూసారం
ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూసారం పెరుగుతుందని గడ్డిపల్లి కేవీకే సీనియర్ శాస్త్రవేత్త నరేష్ అన్నారు.
- 10లో

న్యూస్‌రీల్

4 ఎత్తిపోతల పథకాలకు రూ.124.47 కోట్లు

హుజూర్‌నగర్, కోదాడ: హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో రెండు చొప్పున మొత్తం నాలుగు ఎత్తిపోతల పథకాలకు రూ.124.47 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పాలకవీడు మండలం బెట్టెతండా ఎత్తిపోతలకు రూ.33.83 కోట్లు, చింతలపాలెం మండలం నక్కగూడెం గ్రామ ఎత్తిపోతల పథకానికి రూ.37.70 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే కోదాడ నియోజవకర్గంలోని రెండు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు రూ.52.94 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పాలేరు వాగుపై శాంతినగర్ వద్ద నిర్మించి ఉత్తమ్ పద్మావతి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు రూ.5.30 కోట్లు, రెడ్లకుంట వద్ద పాలేరుపై కుడివైపు నిర్మించే లిఫ్టుకు రూ.47.64 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నాలుగు పథకాలతో ఆయా మండలాల పరిధిలో 26వేల ఎకరాలకు సాగునీరు అందడంతోపాటు 20 వరకు గ్రామాలకు తాగునీరు అందుతుందని పేర్కొన్నారు.

ఆరోగ్యసూత్రాలు పాటించాలి



వైద్యశిబిరంలో కార్మికులకు మందులు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

సూర్యాపేట: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యసూత్రాలు పాటిస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని అదనపు కలెక్టర్ ప్రియాంక అన్నారు. శనివారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది కోసం వెన్నెల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణతో కలిసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కార్మికుల కోసం వైద్య శిబిరం నిర్వహించడంపై వైద్య సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, కౌన్సిలర్ తాహెర్ పాషా, డీఈ సత్యారావు, సారగండ్ల శ్రీనివాస్, సీహెచ్ శివప్రసాద్, ప్రసాద్, వైద్యాధికారి నరేష్ పాల్గొన్నారు.

రామారం చెరువు పనుల పరిశీలన

సూర్యాపేట రూరల్: మండలంలోని రామారం గ్రామంలోని చెరువు ట్రెంచ్ పనులను జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక శనివారం పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఈఈ భద్రునాయక్, ఏఈ ఉదయ్, స్పెషల్ అధికారి దినకర్, పంచాయతీ కార్యదర్శి నవీన్, మాజీ సర్పంచ్ బొల్లం సుమతినాగరాజు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సూర్యాపేట రూరల్: సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాల మేరకు సూర్యాపేట మండల పరిధిలోని నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ వ్యాపారం చేసే సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని, ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌తో పాటు కస్టమర్ కేర్ నుంచి తమకు ఫోన్ చేస్తున్నామని వివరాలు అడిగితే ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బాలునాయక్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగ అలంకరించి ఎదుర్కోలు మహోత్సం చేపట్టారు. ఆ తర్వాత కల్యాణం జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, చిత్రంలో పలువురు జడ్జిలు

చివ్వెంల: ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ అన్నారు. శనివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి ఎస్.అమరావతి, సీనియర్,జూనియర్ జడ్జిలు, డీఎంహెచ్‌ఓ కోటాచలం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి నర్సయ్య పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహిస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ మరణించిన ఓ ఉద్యోగి కుమారుడైన షేక్ ఆసీఫ్‌ను చిలుకూరు మండలం పాలెఅన్నారం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమిస్తూ శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ కారుణ్య నియామ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, జెడ్పీటీసీలు పుల్లారావు, వీరప్రసాద్, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వర్ధెల్లి రాములు సంతాప సభ

- కార్యకర్తలు, ప్రజలు కర్విరాల కొత్తగూడెంకు తరలిరావాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు



వర్ధెల్లి రాములు (ఫైల్)

తుంగతుర్తి : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు వర్ధెల్లి రాములు సంతాప సభ ఆదివారం తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాయుధ పోరుకు ఆయువుపట్టుగా నిలిచిన కర్విరాల కొత్తగూడెం గ్రామంలోని సామాన్య గీత కార్మిక కుటుంబంలో జన్మించిన వర్ధెల్లి రాములు 12ఏళ్ల వయసులోనే గీత కార్మికుల సమస్యలపై పోరాడారని పేర్కొన్నారు. దొరల, భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించి పేదల పక్షాన నిలబడ్డారని గుర్తుచేశారు. ఎన్ని నిర్బంధాలు వచ్చినా తట్టుకుని తన అన్న బుచ్చిరాములు మార్గదర్శకంలో నికార్సయిన కమ్యూనిస్టుగా ఎదిగారని కొనియాడారు. శత్రువుల భౌతికదాడులను సైతం ఎదుర్కొని, సీపీఎం పటిష్టానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధిగానూ..

అంతేకాకుండా 1978వ సంవత్సరంలో తుంగతుర్తి రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌గా మొట్ట మొదటగా గెలిచి సన్న చిన్నకారు రైతులకు పంట రుణాలు ఇప్పించి అన్నదాతలకు దగ్గరయ్యాడని, కర్విరాల వాటర్ షెడ్ చైర్మన్‌గా గెలిచి వరద కాలువలు, చెక్‌డ్యాంలు నిర్మించి ప్రజలు మెచ్చిన ప్రజా ప్రతినిధిగా నిలిచాడని నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. వర్ధెల్లి రాములు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జనవరి 25న తుది శ్వాస విడిచారని, రాములు స్వగ్రామం కర్విరాల కొత్తగూడెంలో ఆదివారం జరిగే సంతాప సభకు సీపీఎం శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వెంకటేశ్వర్లు కోరారు.

కూలే చోట ఉండొద్దన్నారు మరో స్థలం చూపరు!

- శిథిలావస్థలో కోదాడ పాత కూరగాయల మార్కెట్ సముదాయం
- భవనాల్లోకి వెళ్లొద్దని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు
- ప్రత్యామ్నాయం చూపకపోవడంపై వ్యాపారుల ఆగ్రహం
- ఏడాది నుంచి అందులోనే వ్యాపారం సాగిస్తున్న కొందరు



పాత కూరగాయల మార్కెట్ కూలే అవకాశం ఉందని ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన మున్సిపల్ సిబ్బంది (ఫైల్)

పాత మార్కెట్‌లో దుకాణాలు

వెలుపలి వైపు	14
లోపల పెద్దకూరగాయల షాపులు	06
చిన్నవి	08
ఆకుకూరలవి	10
ఎండు చేపలవి	03
కోడిగుడ్లు అమ్మేవి	03
కిరాణ షాపులు	07

కోదాడ: అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వంతో కోదాడలోని పాత కూరగాయల మార్కెట్ భవనాల సముదాయం పట్టణ ప్రజలు, వ్యాపారులకు ప్రాణ సంకటంగా మారింది. శిథిలావస్థకు చేరి ఏ క్షణాన కూలుతుందో తెలియని ఈ మార్కెట్‌లో వ్యాపారం కొనసాగించవద్దని మున్సిపల్ యంత్రాంగం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసింది. వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపకపోవడపై ఆగ్రహంగా ఉన్నారు. ఎక్కడా మరో స్థలం లేకపోవడంతో శిథిలమైన మార్కెట్ భవన సముదాయంలోనే వ్యాపారం సాగిస్తున్నారు.

40 ఏళ్లుగా ఒక్కటే మార్కెట్

కోదాడ మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న పాత భవనంలో 40ఏళ్లుగా కూరగాయల మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. పట్టణ జనాభా 20 వేలు ఉన్నప్పటి నుంచి ప్రస్తుతం జనాభా 80వేలకు పెరిగినా ఈ ఒక్క మార్కెట్ మాత్రమే ఉంది. దీని ముందు భాగంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసి అద్దెకు ఇస్తున్నారు. ఈ రెండు భవనాలు శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం కూల్చి వేయాలని అధికారులు మున్సిపాలిటీకి చెప్పారు. మున్సిపాలిటీ కూడా ఈ భవనాలను కూల్చి వేసి ఆ ప్రదేశంలో నూతన మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించాలని తీర్మానం చేసింది. కానీ మార్కెట్ సముదాయంలోని దుకాణాలకు అద్దె తక్కువగా ఉండడంతో రాజకీయ పలుకుబడితో కొందరు వ్యాపారులు ఈ శిథిల భవనాలను ఖాళీ చేయట్లేదు.

బోర్డు పెట్టారు.. చేతులు దులుపుకున్నారు!

గత సంవత్సరం వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు కూరగాయల మార్కెట్, దానికి ఆనుకొని ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ కూలే స్థితికి చేరింది. దీంతో కలెక్టర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు మార్కెట్ దారులను మూసివేసి కర్రలతో బారికేడ్లను కట్టి లోనికి ఎవ్వరిని వెళ్లకుండా చేశారు. మార్కెట్ శిథిలావస్థలో ఉంది ఎవరూ లోపలికి వెళ్లవద్దని ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశారు. కానీ, ప్రత్యామ్నామం చూపకుండా వ్యాపారాన్ని నిలుపుదల చేయమంటే ఎలా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో ఏడాది కాలంగా అదే మార్కెట్‌లో వ్యాపారం కొనసాగిస్తున్నారు.

త్వరలోనే కూల్చివేస్తాం



పాత కూరగాయల మార్కెట్ శిథిలావస్థలో ఉన్న మాట వాస్తవమే. కొన్ని న్యాయపరమైన చిక్కులు ఉండడం వల్ల కూల్చివేత ఆలస్యం అవుతుంది. వారం పది రోజుల్లో ప్రభుత్వం నుంచి అనుమతి వస్తుంది. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తయితే అందులోనే వ్యాపారులకు ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేస్తాం.

– వెంకటేశ్వరనాయక్, మున్సిపల్ కమిషనర్, కోదాడ

పునాదులకే పరిమితం

రెండేళ్ల క్రితం కోదాడ పశువుల సంతలో రూ.8 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ పునాదులు తీసి పనులను ఆపివేశాడు. తనకు బిల్లులు రావడం లేదని, బిల్లులు వస్తేనే పనులు చేస్తానని చెప్పడంతో నాలుగు నెలల క్రితం కొంత బిల్లు చెల్లించారు. మళ్లీ పనులను మొదలు పెట్టిన కాంట్రాక్టర్ బేస్‌మట్టం లెవల్ వరకు పనులు చేసి మళ్లీ ఆపేశాడు. ఈ లోగా ఎన్నికలు రావడంతో దీని గురించి పట్టించుకొనే వారే కరువయ్యారు. మళ్లీ వానాకాలం సీజన్ వచ్చే లోపైనా ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పూర్తి చేసి తాము వ్యాపారాలు చేసుకునేలా చూడాలని పాత కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు కోరుతున్నారు.



రెండేళ్ల నుంచి పునాదుల దశలోనే నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు

నల్లగొండ బరిలో కోమటిరెడ్డి కూతురు!

- శ్రీనిధిరెడ్డి ఎంపీగా పోటీ చేస్తారని ప్రచారం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూతురు శ్రీనిధిరెడ్డి పోటీ చేయనున్నట్లు తెలిసింది. ఇటీవల ఏఐసీసీ.. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోటీలో ఎవరైతే బాగుంటుంది అనే విషయంపై ఏఐసీసీ సర్వేలు చేయించినట్లు సమాచారం. ఈ సర్వేల్లో మంత్రి కోమటిరెడ్డి కూతురు శ్రీనిధిరెడ్డివైపు కూడా ప్రజలు మొగ్గు చూపినట్లు తెలిసింది. దీంతో అనూహ్యంగా శ్రీనిధిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటికే నల్లగొండ ఎంపీ టికెట్ కోసం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు జయవీర్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులు కూడా ఆయనకే ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో సూర్యాపేట టికెట్ విషయంలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి పోటీ పడ్డారు. టికెట్ దామోదర్‌రెడ్డికి దక్కడంతో పటేల్ రమేష్‌రెడ్డి వర్గమంతా ఆందోళనకు దిగింది. అసెంబ్లీ బరిలో తాను కూడా ఉంటానని రమేష్‌రెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్ అధిష్టానం నల్లగొండ లోక్‌సభ టికెట్ ఇస్తామని ఆయనకు సర్దిచెప్పింది. ప్రస్తుతం ఆయన కూడా లోక్‌సభకు పోటీ చేస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో తాజాగా శ్రీనిధిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. అమెరికాలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చేసిన శ్రీనిధిరెడ్డి తన తండ్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అయితే ఇప్పటివరకు ఆమె ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోలేదు.

కృష్ణా నీటిపై బీఆర్‌ఎస్ పోరుబాట

- 'చలో నల్లగొండ' నిర్వహణకు కసరత్తు
- పాల్గొననున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్!

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కృష్ణా నీటిపై బీఆర్‌ఎస్ పోరుబాట చేపడుతోంది. కృష్ణా జలాల్లో వాటాలు తేల్చాలని డిమాండ్ చేస్తూ చలో నల్లగొండకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. కృష్ణా జలాలకు సంబంధించి సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ పరిధిలోకి తీసుకోవడం, అంతకుముందు ఆంధ్రా అధికారులు అనుమతి లేకుండా నీటిని విడుదల చేసుకోవడం వంటి పరిణామాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరలో చలో నల్లగొండ కార్యక్రమం నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది. పార్టీ శ్రేణులకు అధిష్టానం సమాచారం అందించినట్లు సమాచారం. త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణ వెలువడనుందని తెలిసింది. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నేతలు హాజరు కానున్నట్లు తెలిసింది.

ఎట్టకేలకు బేతవోలు చెరువు అలుగు నిర్మాణం



అలుగు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

చిలుకూరు: వివాదాస్పదంగా మారిన బేతవోలు గ్రామంలోని వీర్లదేవి చెరువు అలుగు నిర్మాణ పనులను ఇరిగేషన్ అధికారులు శనివారం పోలీస్ పహారా నడుమ చేపట్టారు. చెరువు అలుగు ఎత్తుగా ఉండడం వల్ల తమ పొలాలు మునిగిపోతున్నాయని గతేడాది ఆగస్టులో కొందరు రైతులు ధ్వంసం చేశారు. దీంతో మరికొందరు హుజూర్‌నగర్ తాగునీటికి సమస్య వస్తుందని ఘర్షణ పడ్డారు. దీనిపై అప్పట్లో ఇరువర్గాలపై కేసులు కూడా నమోదయ్యాయి. అయితే ప్రస్తుతం బేతవోలు చెరువును నింపేదుకు సాగర్ ఎడమ కాలువ ఎస్కేప్ షట్టర్ ద్వారా నీళ్ల విడుదల చేశారు. దీంతో చెరువు నీరు వృథాగా పోతాయని, అలుగు నిర్మించాలని పలువురు రైతులు సంబంధిత అధికారులకు విన్నవించారు. దీంతో వెంటనే ఇరిగేషన్ డీఈ స్వప్న, ఏఈ మానస, చిలుకూరు ఎస్‌ఐ చల్లా శ్రీనివాస్ యాదవ్, ఏఎస్‌ఐ పులి వెంకటేశ్వర్లుతో కలిసి శనివారం బేతవోలు వచ్చి రైతులతో సమావేశమయ్యారు. గతంలో ఉన్న మాదిరిగానే అలుగు నిర్మాణానికి ఇరుపక్షాలు అంగీకరించడంతో పనులు ప్రారంభించారు. ఆదివారం పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. చెరువు అలుగును ధ్వంసం చేస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. నిర్మాణ పనులు ప్రారంభించడంతో ఎనిమిది నెలలుగా నెలకొన్న చెరువు అలుగు వివాదానికి తెరపడినట్లు అయ్యింది.

సాగు, తాగునీటికి అధిక ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక, చిత్రంలో కలెక్టర్, జెడ్పీ సీఈఓ



జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన సభ్యులు

- గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోండి
- సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక
- పక్కా ప్రణాళికలు సిద్ధం చేస్తాం : కలెక్టర్
- పలు సమస్యలు లేవనెత్తిన సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీ లింగయ్య యాదవ్

సూర్యాపేట టౌన్: జిల్లాలో సాగు, తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రానున్నది వేసవి కాలం కావడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గుజ్జా దీపిక అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని మిషన్ భగీరథ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరు చేసిందని, అత్యవసర పనులకు రూకోటి వరకు ఖర్చు చేసుకోవచ్చన్నారు. వేసవిలో తాగు, సాగు నీటి కొరతను తీర్చేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసి అందిస్తామన్నారు. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలకు విద్యుత్ కొరత లేకుండా నిరంతరాయంగా సరఫరా చేయనున్నట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ కేఆర్‌ఎంబీ పరిధిలోకి తెలంగాణ నీటి ప్రాజెక్టులను తీసుకుపోవద్దని, మన ప్రాజెక్టులపై మన హక్కులు ఉండాలన్నారు. నాగార్జునసాగర్‌లో నీటి లభ్యత లేకపోవడం వలన వచ్చే వేసవి కాలంలో తాగునీటి సమస్య వచ్చే ప్రమాదం ఉందని, సాగర్ ఎడమకాలువ నుంచి నీటిని వదిలి చెరువులను నింపాలన్నారు. పాలేరుకు వెళ్తున్న నీటిని సాగర్ ఎడమ కాలువ పరిధిలోని మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని చెరువులు నింపాలని కోరారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఆలమట్టి నుంచి నీటి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేయాలన్నారు. కేఆర్‌ఎంబీ ప్రాజెక్టును కేంద్ర జలశక్తికి అప్పగించొద్దని సమావేశంలో తీర్మానం చేయగా సభ ఆమోదించింది. అలాగే 2024–25 బడ్జెట్‌ను తీర్మానం చేసి ఆమోదించారు. ఈ సభలో జెడ్పీ సీఈో సురేష్, జిల్లా అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలను ఏకరువు పెట్టిన సభ్యులు

జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. జిల్లాలో చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీళ్లు రావడం లేదని, సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డాక్టర్లు సమయపాలన పాటించడం లేదని, ఎల్లవేళలా రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పెన్‌పహాడ్ జెడ్పీటీసీ అనిత మాట్లాడుతూ మాతాశిశు కేంద్రంలో గర్భిణులను పట్టించుకోకపోవడంతో ప్రైవేట్‌కు వెళ్తున్నారన్నారు. పాలకవీడు ఎంపీపీ మాట్లాడుతూ నేరేడుచర్ల, పాలకవీడు బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు, స్టాఫ్‌ను ఇప్పటికీ నియమించలేదన్నారు. హుజూర్‌నగర్ జెడ్పీటీసీ సైదిరెడ్డి మాట్లాడుతూ అమరవరం గ్రామంలో 12 రోజులుగా నీళ్లు రావడం లేదని, మిషన్ భగీరథ నీళ్లు కూడా శుద్ధి చేయకుండానే సరఫరా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాజిరెడ్డిగూడెం జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న మైనింగ్‌లపై, జిల్లా కేంద్రంలో ఇష్టానుసారంగా నెలకొల్పుతున్న ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని సంబంధిత అధికారులను నిలదీశారు. హుజూర్‌నగర్ ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో వేసవి కాలంలో చేపల వేట కోసం చెరువుల్లో నీటిని తీయకుండా చూడాలన్నారు. సూర్యాపేట జెడ్పీటీసీ భిక్షం మాట్లాడుతూ రైతు రుణమాఫీ ఎప్పుడు చేస్తారో చెప్పాలన్నారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ పదేళ్లుగా కార్పొరేషన్ లోన్లు రావడం లేదని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఒక్కసారి మాత్రమే మంజూరు చేశారు కానీ నేటి వరకు ఫండ్స్ రాలేదన్నారు. మహాలక్ష్మి పథకంతో బస్సులలో రద్దీ పెరిగిందని, గ్రామాల్లో బస్సు సర్వీస్ పెంచాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

లేబర్ డిపార్ట్‌మెంట్‌పై ఆగ్రహం

జిల్లాలోని కార్మికశాఖ అధికారులపై జెడ్పీ సభ్యులు మండిపడ్డారు. దళారులు లేనిదే లేబర్‌డిపార్ట్‌మెంట్‌లో పనులు జరగడం లేదని వాపోయారు. ఏళ్ల కొద్ది డెత్ క్లయిమ్‌లను చేయకుండా ఆఫీసుల చుట్టూ తిప్పుతున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. కనీసం ప్రజాప్రతినిధులు చెప్పినా కూడా అధికారులు వినే పరిస్థితి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేబర్ డిపార్ట్‌మెంట్‌లో అధికారులు సక్రమంగా పనిచేసి అర్హులైన వారి క్లయిమ్‌లను త్వరగా మంజూరు చేయాలన్నారు.

క్లుప్తంగా

మహిళా ఉద్యోగి నిరసన



ఎన్‌ఎస్పీ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పావని

మిర్యాలగూడ: ఎన్ఎస్పీ ఎస్ఈ కార్యాలయంలోని ఓ అధికారి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ జూనియర్ అసిస్టెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. జూనియర్ అసిస్టెంట్ పావని శనివారం ఎన్ఎస్పీ క్యాంపులోని కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేసింది. రెండేండ్ల క్రితం తాను విధుల్లో చేరినప్పటి నుంచి అన్ని విభాగాల పనులను తనతో చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు కేటాయించిన పనులను మాత్రమే చేస్తానంటే సెలవులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని పావని కోరారు.

వ్యక్తి ఆకస్మిక మృతి

వలిగొండ: ఓ వ్యక్తి ఆకస్మికంగా మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండల పరిధిలోని ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన రంగరాజు ఆనంద్ కుమార్ (52) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట మండలంలోని తుముకుంటలో నివాసం ఉంటున్నారు. ఆనందకుమార్ తల్లి ఇటీవల మరణించడంతో ఆమె అంత్యక్రియల కోసమని కుటుంబంతో సహా వలిగొండ మండల కేంద్రానికి వచ్చాడు. కొద్ది రోజుల క్రితం భార్య శిరీష, కొడుకు సాయితేజను తుముకుంటకు పంపించేశాడు. శుక్రవారం రాత్రి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి శనివారం మృతి చెంది ఉన్నట్లు గుర్తించి మృతుడి సోదరుడు ఇచ్చిన సమాచారం ఇవ్వడంతో భార్య శిరీష వలిగొండకు చేరుకుంది. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

ఇప్పలగూడెంలో వ్యక్తి దారుణ హత్య

- హతుడి తలపై పదునైన ఆయుధంతో పొడిచినట్లు ఆనవాళ్లు
- వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య చేసినట్లు అనుమానాలు
- కేతేపల్లి మండలంలో దారుణం



సంఘటన స్థలంలో సైదులు మృతదేహం



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, సీఐ రాఘవరావు

కేతేపల్లి: మండలంలోని ఇప్పలగూడెంలో దుండగులు ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఇప్పలగూడెం గ్రామానికి చెందిన వంటల జానయ్య కుమారుడు వంటల సైదులు(38) ఇరవై ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన అర్చనను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు సంతానం ఉన్నారు. కొన్నాళ్ల తర్వాత వీరిద్దరి మధ్య బేదాభిప్రాయాలు రావటంతో భార్య అర్చన తన చిన్న కుమారుడు, కూతురును తీసుకుని ఎనిమిదేళ్ల క్రితం భర్త సైదులు నుంచి విడిపోయి హైదరాబాద్‌లో నివాసం ఉంటుంది. సైదులు ప్రస్తుతం తన పెద్ద కుమారుడు చందుతో కలసి గ్రామంలోనే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో స్థానికంగా ఉన్న దుకాణం వద్ద మద్యం సేవించిన సైదులు రాత్రి పొద్దుపోయే వరకు కూడా ఇంటికి చేరుకోలేదు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లగా.. గుడివాడకు వెళ్లే దారిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఆవరణలో రక్తపు మడుగులో ఉన్న సైదులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు.



సైదులు (ఫైల్)

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

శాలిగౌరారం సీఐ రాఘవరావు, కేతేపల్లి ఎస్ఐ శివతేజ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నల్లగొండ నుంచి డాగ్ స్క్వాడ్ క్లూస్‌టీంలను రప్పించి వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్ గ్రామ శివారులో ఉన్న కట్ట మైసమ్మ ఆలయం వరకు వెళ్లి వచ్చినట్లు తెలుస్తుంది. మృతుని చెవిపై భాగంలో, చెంప, గడమ, ఛాతిపై బలమైన గాయాలు తగలటంతో దుండగులు పదునైన చాకుతో దాడి చేసినట్లుగా భావిస్తున్నామని సీఐ రాఘవరావు తెలిపారు. తమ తండ్రిని కొట్టి చంపారంటూ మృతుడి కుమారుడు చందు కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని పేర్కొన్నారు.

వివాహేతర సంబంధమే కారణమా?

మృతుడు వంటల సైదులు గ్రామంలో ఓ వివాహితతో కొంత కాలంగా కొనసాగిస్తున్న వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసినట్లుగా పలువురు చర్చించుకుంటున్నారు. విషయం మహిళ ఇంట్లోని కుటుంబ సభ్యులకు తెలియటంతో వారే సైదులును హత్య చేసినట్లుగా హతుడి సన్నిహితులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య జరిగిన తర్వాత శనివారం ఉదయం నుంచి అనుమానిత కుటుంబ సభ్యులు ఎవరూ గ్రామంలో కనిపించక పోవటంతో ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చినట్లయింది. పోలీసులు కూడా ఈ కోణంలోనే దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈనేపథ్యంలో సదరు అనుమానిత మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంతో విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల విచారణ అనంతరం సైదులు హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి.

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

- బీమా సొత్తు ఇవ్వకుండా ఆలస్యం చేస్తున్నారని ఆరోపణ
- అడ్డుకున్న పోలీసులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కార్మికశాఖలో డెత్ బీమా కొరకు దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఆపుతున్నారని ఓ మహిళ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సకాలంలో గుర్తించి పోలీసులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. సూర్యాపేట కలెక్టరేట్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చివ్వెంల మండలం ఐలాపురం గ్రామానికి చెందిన బుడిగ నిర్మల శనివారం పెట్రోల్ బాటిల్‌తో జిల్లా కలెక్టరేట్‌కు వచ్చింది. గమనించిన పోలీస్‌లు కార్యాలయం ప్రధాన గేటు ముందే ఆమె వద్ద నుంచి పెట్రోల్ బాటిల్ లాగుకోవడంతో ప్రమాదం తప్పింది. అనంతరం బాధితురాలు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించింది. తన మామ బుడిగ వెంకటయ్య కార్మికశాఖలో భవన నిర్మాణ కార్మికుడిగా లేబర్ కార్డు కలిగి ఉన్నాడు. అతను గత సంవత్సరం మరణించగా ఇన్సూరెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నది. అయితే సూర్యాపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఇన్సూరెన్స్ అందకుండా అడ్డుపడుతున్నాడని తెలిపింది. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ దరఖాస్తు పరిశీలించి బీమా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పులినా.. హైనానా?

- రెండో రోజు కొనసాగిన అటవీ అధికారుల గాలింపు చర్యలు
- అడుగుల జాడతో హైనాగా భావిస్తున్న అధికారులు



రామన్నపేటలో గాలిస్తున్న అటవీశాఖ అధికారులు

రామన్నపేట: రామన్నపేట పరిసరాల్లో శుక్రవారం పులి సంచరించిందనే వార్త ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. గూడ్స్‌రైలు గార్డ్ పులి ట్రాక్‌ను దాటుతుంటే చూశానని రైల్వే అధికారులకు తెలుపడంతో పులి సంచరించిదనే వార్తకు బలం చేకూరింది. పోలీసు, అటవీశాఖ అధికారులు పులి సంచరించిందని అనుమానం కలిగిన ప్రాంత పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ రాత్రంతా గడిపారు. కొమ్మాయిగూడేనికి చెందిన రైతు కూడా తనకు పులి కనిపించిందని తెలుపడంతో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో ట్రాకింగ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. శనివారం కూడా అటవీశాఖ అధికారులు పులికోసం గాలించారు. అధికారులు ఏర్పాటు చేసిన కెమెరాల్లో జంతువుల కదలికలు ఏమీ రికార్డు కాలేదు. రైతు తనకు పులి కనిపించిందని చెప్పిన ప్రదేశంలో అడుగులను పరిశీలించారు. అధికారులు గుర్తించిన అడుగుల్లో గోర్ల ఆనవాళ్లు ఉన్నాయి. కాబట్టి కుక్కజాతికి చెందిన హైనా సంచరించి ఉంటుందని, పులిని పోలి ఉండే హైనాను చూసి రైల్వేగార్డ్, రైతు పులిగా భావించి ఉంటారని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. పిల్లి జాతికి చెందిన పులి కూడా గోర్లు కలిగి ఉంటుందని అవసరమైన సమయంలోనే అంటే ఇతర జంతువులు, మనుషులపై దాడి చేసే సమయంలోనే గోర్లు బయటకు వస్తాయని, సాధారణంగా పులి నడిచేటప్పుడు గోర్లు బయటకు రావనేది అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రామన్నపేట పరిసరాల్లో సంచరించింది పులిని పోలిన హైనా అయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. శుక్ర, శనివారాల్లో జంతువులు, మనుషుల మీద దాడిచేయడం వంటి సంఘటనలు చోటు చేసుకోక పోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

హడలెత్తించిన సోషల్ మీడియా

సోషల్‌మీడియాలో వచ్చిన పలు వీడియోలు ప్రజలను మరింత భయ భ్రాంతులకు గురి చేశాయి. అడవిలోని బాటగుండా పులి నడుచుకుంటూ వెళ్తున్నట్లు ఉన్న వీడియో, గేదెలను చంపినట్లు ఉన్న ఫొటోలు వైరల్ కావడంతో ప్రజలు హడలెత్తిపోయారు. ప్రజలను సందేహాలను నివృత్తి చేయడానికి పోలీసు అధికారులు నానా తంటాలు పడ్డారు.

కారు అద్దాలు పగులగొట్టి నగదు చోరీ



కారును పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడంలో శనివారం చోటు చేసుకుంది. టూటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రైస్‌మిల్లు వ్యాపారి గౌరు శ్రీనివాస్ వేములపల్లి మండల కేంద్రంలోని ఓ బ్యాంకు నుంచి రూ. 2లక్షలు డ్రా చేసుకుని తన కారులో డబ్బుల బ్యాగ్‌ను పెట్టుకుని మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడంలో గల ఆయన ఇంటికి చేరుకున్నాడు. తిరిగి వెంటనే వెళ్లాలనే ఉద్దేశంతో డబ్బుల బ్యాగ్‌ను కారులోనే ఉంచి తాళం వేసి ఇంట్లోకి వెళ్లాడు. పదిహేను నిమిషాల వ్యవధిలో కారువద్దకు చేరుకుని చూడగా అద్దాలు పగులకొట్టి ఉన్నాయి. కారులో చూడగా రూ.2లక్షల డబ్బులు బ్యాగ్ కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలనీలో ప్రజలకు వాకబు చేయగా రెండు బైక్‌లపై నలుగురు వ్యక్తులు వెళ్లినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ పి.వెంకటగిరి చోరీ జరిగిన ప్రాంతానికి వెళ్లి కారును పరిశీలించారు. నిందుతులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగా డబ్బులు డ్రా చేస్తుండగా చూసి కారును వెంబడించి డబ్బులు కాజేశారా..? లేక పక్కా సమాచారంతో అక్కడికి చేరుకున్న దుండగులు చాకచక్యంగా కారు అద్దాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారా..? అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

లారీ, ట్రాక్టర్ ఢీ.. పలువురికి గాయాలు



గాయపడిన మహిళా కూలీ

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): లారీ, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీ కొనడంతో పలువురు కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్లు శివారులో శనివారం చోటుచేసుకున్నది. మట్టిలోడుతో దంతాలపల్లి నుంచి సూర్యాపేట వైపు వస్తున్న లారీ నెమ్మికల్లు నుంచి కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను నంద్యాలగూడెం స్టేజీ సమీపంలో ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నెమ్మికల్లుకు చెందిన పలువురు మహిళా కూలీలు దండుగుల లక్ష్మి, మద్ది మమత, కొడిదల వెంకటమ్మ, వీరమోయిన ఐలమ్మ, మానుపురి అలివేలులతో పాటు పలువురికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై సాయంత్రం వరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్‌లో నీళ్లు

భూదాన్‌పోచంపల్లి: గ్యాస్ సిలిండర్‌లో నుంచి నీళ్లు బయటివచ్చిన సంఘటన శనివారం జలాల్‌పురంలో చోటు చేసుకొంది. బాధితుడు కొయ్యడ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. వినియోగదారుడు పోచంపల్లిలోని ఇండియన్ గ్యాస్‌ను వినియోగిస్తున్నాడు. ఉదయం వంట చేయడానికి గ్యాస్ పొయ్యి వెలిగిస్తే మంట రాలేదు. గ్యాస్ అయిపోయిందని భావించి సిలిండర్ మారుద్దామని చూడగా సిలిండర్ బరువుగా ఉంది. కదిపితే చూస్తే ద్రవం వలె శబ్దం వచ్చింది. దాంతో అనుమానం వచ్చి సిలిండర్‌ను తలకిందులుగా చేయగా అందులో నుంచి సుమారు 3 లీటర్ల నీళ్లు వచ్చాయి. ఇదే విషయమై స్థానిక ధర్మశాస్త్ర గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ చేసి తెలుపగా తమకు ఏమి సంబంధంలేదని, కంపనీ నుంచి వచ్చిన సిలిండర్‌లనే వినియోగదారులకు సరఫరా చేస్తున్నామని సమాధానం చెప్పాడని వినియోగదారుడు వాపోయాడు. అయితే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు నల్ల నాగేశ్ జరిగిన ఘటనపై వివరణ ఇస్తూ సిలిండర్‌లో గ్యాస్‌నింపే క్రమంలో ఒక్కోసారి అరుదుగా ఇలా జరుగుతుందని అన్నారు. దీంట్లో తమ ప్రమేయం ఉండదని చెప్పారు. సిలిండర్ తీసుకొచ్చి ఇస్తే కంపనీకి పంపించి, దానికి బదులు మరో సిలిండర్‌ను ఇస్తామని పేర్కొన్నాడు.

కారు బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు



ధ్వంసమైన కారు

మోత్కూరు : కారు అదుపుతప్పి బోల్తా పడడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి ఎక్స్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. 108 వాహనం ఈఎంసీ తొంట భాస్కర్, పైలట్ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి, ముద్దారం గ్రామాలకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన రాజు, రామన్నపేట మండలం దుబ్బాకకు చెందిన రంజిత్‌రెడ్డి, సూర్యాపేటకు చెందిన అశోక్‌లు జనగామ నుంచి కారులో వస్తున్నారు. మోత్కూరు మున్సిపల్ పరిధిలోని జామచెట్లబావి ఎక్స్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి కారు అదుపు తప్పి బోల్తాకొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.



గాయపడిన శ్రీకాంత్‌రెడ్డి

అదృశ్యమైన వృద్ధుడు మృతి



యాకూబ్ (ఫైల్)

నల్లగొండ క్రైం: అదృశ్యమైన వృద్ధుడు మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని శనివారం టూటౌన్ పోలీసులు గుర్తించారు. నల్లగొండ పట్టణం మిర్యాలగూడ రోడ్డులోని హైటెక్ కాలనీలో నివాసం ఉంటున్న రేవూరి యాకూబ్(78) జనవరి 25న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. మతిస్థిమితం కారణంగా ఇంటి నుంచి కొద్ది దూరంలో అనేక సార్లు తిరిగి పడి పోవడంతో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా విచారించి కుటుంబ సభ్యులకు తెలియ జేశారు. డీఆర్‌డీఏలో సూపరింటెండ్‌గా పనిచేస్తున్న మృతుడి కుమార్తె రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

భూదాన్‌పోచంపల్లి : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంఘటన శనివారం రాత్రి గౌస్‌కొండ సమీపంలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం కైతాపురం గ్రామానికి చెందిన కందగట్ల జంగారెడ్డి(38) వ్యక్తిగత పనిమీద బైక్‌పై పోచంపల్లి నుంచి భట్టుగూడెం వైపు వెళ్తున్న క్రమంలో గౌస్‌కొండ నుంచి పోచంపల్లికి గడ్డిలోడుతో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ముందు లైట్లు వేసుకోకుండా వస్తున్నాడు. ఈ క్రమంలో గౌస్‌కొండ గ్రామశివారులో చీకట్లో ట్రాక్టర్‌ను గమనించక ఎదురుగా వచ్చిన జంగారెడ్డి ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో జంగారెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులు సమాచారం ఇవ్వగా వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. అనంతరం తీవ్రంగా గాయపడిన జంగారెడ్డిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్‌డ్రైవర్ ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. అనంతరం పోలీసులు ట్రాక్టర్, ప్రమాదానికి గురైన బైక్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముదిమాణిక్యం మేజర్ వద్ద ఉద్రిక్తత

నిడమనూరు: మండలంలోని ముదిమాణిక్యం మేజర్ వద్ద శనివారం రాత్రి రైతులు మేజర్ షట్టర్ ఎత్తే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొన్నది. సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. మండలంలోని ముదిమాణిక్యం మేజర్ పరిధిలో నాటు వేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయని రైతులు శనివారం సాయంత్రం చీకటి పడగానే మేజర్ షట్టర్‌ను కొంత మేరకు ఎత్తారు. షట్టర్‌లను పూర్తిగా ఎత్తి నీటిని విడుదల చేయాలని అక్కడే ఉన్న ఎన్ఎస్పీ డీఈ శ్రీనివాస్‌రెడ్డిని అడిగినా అనుమతి లేనందున చేయలేమని అన్నారు. దీంతో రైతులు షట్టర్ ఎత్తి నీటిని విడుదల చేసుకుంటామని ఎన్ఎస్పీ అధికారులు లస్కర్‌లతో వాదనకు దిగారు. అధికారులు నిడమనూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ జోజి ఆధ్వర్యంలో పోలీసులు మేజర్ వద్దకు చేరుకుని రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అనుమతి లేకుండా షట్టర్ ఎత్తవద్దని, సమస్యలు తేవద్దని వారు రైతులను కోరారు. అయినా రైతులు వినకుండా పొలాలు ఎండిపోతున్నాయని, నీరు విడుదల చేయాల్సిందే అని పట్టుబట్టారు. మేజర్‌ల వద్ద పోలీసులు, లస్కర్‌లు కాపలాగా ఉన్నారు. నిడమనూరు మండలంలోని నారమ్మగూడెం, రేగులగడ్డ, తుమ్మడం, అడవిదేవులపల్లి మండలం ఉల్సాయి పాలెం రైతులు మేజర్ వద్దకు వచ్చిన వారిలో ఉన్నారు. నిడమనూరు మండలం రైతులు వెనుదిరగగా, అడవిదేవుల పల్లికి చెందిన గిరిజన రైతులు అక్కడే ఉండి అధికారులతో వాదనలు చేస్తూనే ఉన్నారు.

రైతులు ఏడుస్తున్నారు

వరి పొలాలు ఎండిపోతున్నాయని రైతులు కంటతడి పెడుతున్నారు. మెయిన్ కెనాల్‌లో నీళ్లు తీసుకుపోతూ మేజర్ కాలువలకు విడుదల చేయకపోతే ఊరుకునేది లేదు. రైతులను ఇబ్బంది పెట్టకుండా నీటి విడుదల చేయాలి. – గడ్డం గోవింద రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్, నిడమనూరు

లోక్‌సభ ఎన్నికల్లో విజయఢంకా మోగిద్దాం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్: లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ప్రతినిధుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాల్లో విజయం కోసం యూత్‌కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలని కోరారు. ప్రతి కాంగ్రెస్ సైనికుడు గత ప్రభుత్వ అవినీతి పాలనకు వ్యతిరేకంగా పని చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ అందజేస్తున్న ఫలాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని కోరారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం యువజన కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర ఉద్దేశాలను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయి కమిటీల బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు.

భువనగిరిలో విషాదం



ఇద్దరు విద్యార్థినుల మృతి ఘటనపై వార్డెన్‌ను విచారిస్తున్న డీఈఓ, పోలీసులు





ఆసుపత్రిలో రోదిస్తున్న వైష్ణవి తల్లిదండ్రులు



రోదిస్తున్న భవ్య తల్లి